
# అనగనగా... ఒక కథ




**ఈ కథ సృష్టి ప్రారంభమైనప్పుడు జరిగింది అనుకుందాం. అలా అనుకుంటేనే చదవడానికి ఇంట్రెస్ట్ కలుగుతుంది.**

బ్రహ్మదేవుడు చెట్లూ.. చామలూ.. పుట్టించాక రకరకాల జీవరాసుల్ని క్రియేట్ చేశాక మనుషుల్ని సృష్టించాడు. అన్ని జీవులూ పుట్టగానే బ్రహ్మదేవుడికి దణ్ణం పెట్టి వాళ్ల వాళ్ల ప్లేసులకి వెళ్లిపోయాయ్. అంటే.. చేప ఏమో నీళ్లల్లోకీ చిలకేమో చెట్టుమీదకి పాము ఐతే పుట్టలోకి అన్నమాట.

కానీ చెట్టూ..మనిషి బ్రహ్మదేవుడికి దణ్ణం పెట్టి వెళ్లకుండా నిలబడిపోయాయి/డు.

''ఏంటలా నిలబడిపోయారు. మీ నెలవులకి చేరుకోండి'' అన్నాడు బ్రహ్మదేవుడు.

మనిషి నోరు విప్పి ''మాకు నూరేళ్ల ఆయుర్దాయం కావాలి'' అన్నాడు.

బ్రహ్మదేవుడు కొన్ని రూల్సూ.. రెగ్యులేషన్సూ చెప్పి ''ఈ నియమాలు పాటిస్తే మీ ఆయుర్దాయానికి ఢోకా లేదు'' అని ఆశీర్వదించాడు.

మనిషి భూలోకానికి వెళ్లిపోయాడు. చెట్టు ఇంకా అక్కడే ఉండటం చూసి బ్రహ్మ.. ''నీకేం వరం కావాలో కోరుకో'' అన్నాడు.

''నేను మనిషి కన్నా ఎక్కువ కాలం బతకాలి''

''ఎంత ఆశా..''

''ఆశ్చర్యపోకండి మహాప్రభూ... నేను బతకాలనుకునేది మనిషి కోసమే. ఒక్కసారి భూమిలోకి దిగానంటే రెండు మూడు తరాలైనా మానవులకి సహకరించాలి. నేను బతికున్నన్నాళ్లు ఒకవేళ.. మొదలంటా కూలిపోయినా మనిషికి సహకరించాలి'' అని వేడుకుంది చెట్టు.

బ్రహ్మదేవుడు నవ్వి... ''చెట్టమ్మా... మనుషుల్ని నమ్ముతున్నావా? వాళ్లు మెదడు పెంచుకుని ఎదిగిపోతారు. నిన్ను నానా రకాలుగా హింసిస్తారు.. తెలుసా?''

''తెలుసు.. కానీ దాన్ని నేను హింసగా భావించను. వాళ్లకి నేను సహకరించాననే అనుకుంటాను. నా ఆకులూ.. కొమ్మలూ.. కొట్టినా.. కట్టెలుగా మార్చినా కట్టె కడపటి వరకూ వాళ్లకి తోడుంటాను''

బ్రహ్మదేవుడు థ్రిల్ అయిపోయాడు.

''నువ్వెంత మంచిదానివి.. అమ్మలా ఆలోచిస్తున్నావ్.. కానీ మనుషులు ఆమె

కొడుకుల్లా నిన్ను పట్టించుకోరు. జాగర్త మరి.''

''నువ్వే చెప్పావ్.. అమ్మా కొడుకూ అన్నావ్.. గుండెల మీద తన్నినా.. అమ్మ కొడుకును ఎత్తుకొని ముద్దాడుతూనే ఉంటుంది కదా. నేనూ మనుషుల్నీ నా బిడ్డల్లాగే చూసుకుంటాను''

బ్రహ్మదేవుడికి ఎనిమిది కళ్లూ చెమర్చాయి.

''అమ్మలూ.. నీకు ఇంకా గొప్ప వరాలిస్తున్నాను.. నువ్వు అనేక జాతులతో అనేక పేర్లతో వర్ధిల్లుతావు. నేల మీద గడ్డి మొదలు.. నింగినంటే మహా వృక్షాలుగా నీ జాతి వర్ధిల్లుతుంది. పొదల్లా.. గుబురుల్లా.. కొండల్లో గుట్టల్లో ఎక్కడైనా నీ జాతి పచ్చగా విస్తరిస్తుంది. ఇది నా వరం'' అన్నాడు చతుర్ముఖుడు.

చెట్టు కదల్లేదు.

అనురాగపూరితంగా...

''ఇంకా ఏం కావాలమ్మా?'' అన్నాడు బ్రహ్మ.

''నాకు కొమ్మలు కొట్టేసినా మళ్లీ చిగురించి పెరిగే అనుగ్రహాన్ని ప్రసాదించండీ'' అంది చెట్టు.

''ఆకులు రాలినా నువ్వు చిగురిస్తావ్. కొమ్మలు నరికినా నువ్వు విస్తరిస్తావ్. నీకు పుట్టుకతోనే ఆ భాగ్యం ఉంది''

''ధన్యోస్మి ప్రభూ..'' అంటూ చెట్టు నిష్క్రమించింది. భూలోకంలో అవతరించింది.

★ ★ ★

భూలోకంలో.. కథ స్టార్ట్ చేద్దాం.

అనగనగా ఓ కుర్చీ.. ఎప్పటిదీ.. ముత్తాతల నాటిది. అది ఇలా కూర్చుంటే ముందుకీ వెనక్కీ ఊగుతుంది. వయసు మళ్లిందో ఏమోగానీ.. ఊగుతోన్నపుడు మూలుగుతోంది.

ఓ చెట్టు.. మొక్కలా పుట్టి.. పెరిగి ఒళ్లు కోయించుకుని ముస్తాబు చేయించుకుని కుర్చీగా మారి మూడు తరాల నుంచి జనాన్ని మోస్తున్న ఆ చెట్టు తన జన్మ ధన్యమైపోయినట్టు పులకిస్తోంది.

ఒక్కసారి కుర్చీ పుటుక్కుమంది. కన్న చెట్టేమీ కన్నీరెట్టలేదు. తన చేతులు కొన్ని కోసిచ్చి పిల్లాణ్ని ఒళ్లో కూర్చోబెట్టుకున్నట్లు మూడు తరాలు మురిసిపోయింది. చెట్టమ్మకి చాలా చేతులు మొలిచాయి. చాలా పనులకి చేదోడైంది.

ఇవ్వాళ కుర్చీ నడ్డి విరిగింది. బొగ్గుల్లా మారి నాలుగో తరానికి అన్నం వండి పెట్టడానికి సహకరించింది. తనలో ఒక భాగం ఇవ్వాళ బూడిద అయినా తను జనానికి ఉపయోగపడటం ఆ చెట్టు చూస్తూనే ఆనందపడింది.

★ ★ ★

బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యా

చెట్టు ఆనందాన్ని.. సంతోషాన్ని చూసి ''నా సృష్టి నీ వల్లే నిలుస్తుంది'' అని చెట్టును మెచ్చుకున్నాడు.

చెట్టు కన్న తండ్రిని చూడగానే కన్నీళ్లు పెట్టుకున్న అత్తింటి కోడల్లా భోరుమంది.

''ఏమైంది తల్లీ..''

''ప్రభూ... నా జాతిని జనానికి వినియోగపడేలా ఇంకా ఇంకా విస్తరించేలా చేయలేవా?''

''చెట్టమ్మా... నీకు జనాల మీద ఎంత జాలి. అందులో కొంత జాలి, ప్రేమ నీ మీద వాళ్లకున్నా వాళ్ల జీవితాలు బాగుపడతాయి. కానీ జనాలున్నారే.. ఖండించేసినా పెరగరు. తుంచేసినా ఎదగరు. వాళ్లు నిన్ను ఆశ్రయించుకుని, ఘోరాలు చేయడానికి స్థావరాలుగా చేసుకొని అడవులకి అప్రతిష్ఠ తెస్తున్నారు''

''నన్ను సృష్టి నుంచి తీసేయండి ప్రభూ'' అంది దుఃఖపూరితంగా చెట్టు.

''నేను ఆ పని చెయ్యక్కర్లేదమ్మా'' అన్నాడు, బ్రహ్మ ఆర్ద్రపూరితంగా.

## ఎన్నాళ్లకెన్నాళ్లకు...

**ఒకప్పుడు సీనియర్ ఎన్టీఆర్‌కి పర్సనల్ మేకప్ మాన్ అయిన పీతాంబరం కొడుకే నేటి ప్రముఖ దర్శకుడు పి.వాసు (పీతాంబరం వాసు). ఎన్టీఆర్ కుమారుడు బాలకృష్ణ-పీతాంబరం కుమారుడు వాసు కలయికలో దాదాపు ఇరవయ్యేళ్ల క్రితం 'సాహసమే జీవితం' అనే సినిమా వచ్చింది. ఈ సినిమాకి వాసు-భారతి సంయుక్తంగా దర్శకత్వం వహించి దర్శకులుగా మారారు. మళ్లీ ఇన్నాళ్లకి పి.వాసు దర్శకత్వంలో బాలకృష్ణ 'మహారథి'లో నటించాడు. ఓ రకంగా ఇది క్రేజీ కాంబినేషనే మరి! అందుకనే ఈ సినిమాపై అంచనాలు బాగా వున్నాయి.**

